హీరో భార్యకు నచ్చలేదని నన్ను తీసేశారు: తాప్సీ 4

Neti Velugu
నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
RNI NO. TELTEL/2023/88559
తెలుగు దినపత్రిక
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com

నేటి వెలుగు
తెలుగు దినపత్రిక
రిపోర్టర్లు కావలెను
తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్
రెండు తెలుగు రాష్ట్రాలలో నేటి వెలుగు తెలుగు దినపత్రికలో పని చేయుటకు
జిల్లా బ్యూరో
జిల్లా స్టాఫ్
డివిజన్ అసెంబ్లీ ఇంచార్జిలు
మండల రిపోర్టర్లు
జూనియర్లకు సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.
సంప్రదించవలసిన ఫోన్ నెంబరు
95532 76552
ఎడిటర్
నవీన్ కుమార్ గౌడ్

నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 166 | పేజీలు : 4 | సెప్టెంబర్ 29 మంగళవారం 2026 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 166 | PAGES:4 | TUESDAY SEPTEMBER 29 2026 | Rs. 4:00

# సిరిసిల్లపై సీఎం ప్రత్యేక దృష్టి.. నేతన్నలకు కొత్త భరోసా!



- సీఎం హోదాలో తొలిసారి సిరిసిల్ల పర్యటన
- రూ.345.78 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- నేతన్న ఉత్పత్తులకు 'నేతన్న బజార్' ప్రతిపాదన
- రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు
- వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.99.40 కోట్లు
- రగుడు బైపాస్ వద్ద భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు

**సిరిసిల్ల, సెప్టెంబర్ 29:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఈ నెల 30న పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో సిరిసిల్లకు తొలిసారి వస్తున్న నేపథ్యంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడంతో పాటు రగుడు బైపాస్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించేందుకు

(మిగతా 2వ పేజీలో..)

## 'తాయ్ మామన్' పథకానికి శ్రీకారం.. మేనమామలా మారిన సీఎం విజయ్

- 'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని ప్రారంభించిన సీఎం విజయ్
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం
- మధురై రాజాజీ ఆసుపత్రిలో చిన్నారులకు స్వయంగా ఉంగరాలు తొడిగిన సీఎం
- కొందరు చిన్నారులకు సంప్రదాయబద్ధంగా నామకరణం కూడా చేసిన విజయ్

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేడు మధురైలో 'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరాన్ని అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. మధురైలోని ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా సీఎం విజయ్ ఈ బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టారు. బిస్కెట్ కలర్ చొక్కా, పంచె ధరించిన సీఎం విజయ్, వేదికపై ముగ్గురు శిశువులకు స్వయంగా బంగారు ఉంగరాలు తొడిగి

(మిగతా 2వ పేజీలో..)



## ఫార్ములా–ఈ కేసు: కేటీఆర్‌కు బిగ్ షాక్.. పాస్‌పోర్ట్ జప్తునకు కోర్టు ఆదేశం!

- కేటీఆర్‌తో పాటు మరో ముగ్గురి పాస్‌పోర్టులు సీజ్ చేయాలని సూచన
- నిధుల దుర్వినియోగం ఆరోపణలపై కొనసాగుతున్న ఏసీబీ దర్యాప్తు
- నిందితులు విదేశాలకు వెళ్లకుండా నిరోధించేందుకే ఈ చర్యన్న ఏసీబీ అధికారులు



రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫార్ములా–ఈ రేసు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా

(మిగతా 2వ పేజీలో..)

## హైదరాబాద్‌లో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కలకలం..

- హైదరాబాద్ మణికొండలో చెడ్డీ గ్యాంగ్ ప్రత్యక్షం
- అపార్ట్‌మెంట్‌లో చోరీకి పాల్పడి మహిళపై దాడి
- కేసు దర్యాప్తునకు మూడు ప్రత్యేక పోలీస్ బృందాల ఏర్పాటు



సెక్యూరిటీ గార్డుల పాత్రపై ఆరా తీస్తున్న పోలీసులు

(మిగతా 2వ పేజీలో..)

## ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ.. గెజిట్ విడుదల చేసిన అసెంబ్లీ

- దానం నాగేందర్‌పై అనర్హత వేటుతో ఖైరతాబాద్ స్థానం ఖాళీ
- హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేయడమే కారణం
- ఉప ఎన్నికలో గెలుపుపై ధీమా వ్యక్తం చేసిన దానం నాగేందర్

తెలంగాణలో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం

(మిగతా 2వ పేజీలో..)



## యువకుడిపై చేయి చేసుకున్న మంత్రి... తీవ్రంగా స్పందించిన రాహుల్ గాంధీ

- ఢిల్లీలో యువకుడిపై చేయి చేసుకున్న మంత్రి పర్వేశ్ వర్మ
- ఘటనపై తీవ్రంగా స్పందించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ
- బీజేపీ నేతలకు ఓటర్లంటే భయం లేదంటూ విమర్శ
- ఇదంతా అధికార అహంకారమేనని రాహుల్ ఘాటు వ్యాఖ్యలు
- ఆయనకు విషయం తెలియదంటూ మంత్రి కౌంటర్



ఢిల్లీలో ఓ యువకుడిపై బీజేపీ మంత్రి భౌతిక దాడికి దిగిన

(మిగతా 2వ పేజీలో..)

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

# సిరిసిల్లపై సీఎం ప్రత్యేక దృష్టి.. నేతన్నలకు కొత్త భరోసా!

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి. లక్ష మంది వరకు జన సమీకరణ లక్ష్యంగా ఏర్పాట్లు జరుగుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.వస్త్ర పరిశ్రమకు ప్రసిద్ధి చెందిన సిరిసిల్లలో నేత కార్మికుల సంక్షేమం, మహిళా సాధికారత, విద్య, మౌలిక వసతులకు సంబంధించిన పలు కార్యక్రమాలను సీఎం ప్రారంభించనున్నారు. సిరిసిల్లకు సంబంధించి నేతన్న ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించే దిశగా 'నేతన్న బజార్' ప్రతిపాదన కూడా పర్యటనలో ప్రాధాన్యం సంతరించుకుంది.

**నేతన్నలకు మార్కెటింగ్ వేదిక**

సిరిసిల్లలో తయారయ్యే చేనేత, పవర్‌లూమ్ వస్త్రాలకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు 'నేతన్న బజార్' ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ బజార్ అందుబాటులోకి వస్తే నేతన్న ఉత్పత్తులను వినియోగదారులకు నేరుగా చేరువ చేసే అవకాశం ఉంటుంది. అయితే దీనికి సంబంధించిన తుది ఆమోదాలు, నిధుల అంశాలు అధికారికంగా ఖరారు కావాల్సి ఉంది.

**రూ.345.78 కోట్ల పనులకు శ్రీకారం**

సీఎం పర్యటనలో భాగంగా మొత్తం రూ.345.78 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. విద్య, ఆలయ అభివృద్ధి, పరిపాలనా భవనాలు, పోలీస్ మౌలిక వసతులు తదితర రంగాలకు సంబంధించిన పనులు ఇందులో ఉన్నాయి.

**రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు**

సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి, ఆధునిక సౌకర్యాలు కల్పించేలా ఈ విద్యా సముదాయాలను అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

**రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.99.40 కోట్లు**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.99.40 కోట్లతో చేపట్టనున్న పలు పనులకు సీఎం శ్రీకారం చుట్టనున్నారు. ఆలయ పరిసరాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల తదితర పనులు ఇందులో భాగంగా ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

**పరిపాలనకు కొత్త భవనాలు**

సిరిసిల్ల, వేములవాడ, తంగళ్లపల్లి, వీర్నపల్లి, వేములవాడ రూరల్, రుద్రంగి ప్రాంతాల్లో తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేయనున్నట్లు సమాచారం. వేములవాడలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, రుద్రంగిలో గోదాములు, వేములవాడలో మహిళా పోలీస్ స్టేషన్, సిరిసిల్ల--వేములవాడలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించిన పనులు కూడా పర్యటనలో భాగంగా ఉన్నాయి.

**రగుడు బైపాస్ వద్ద భారీ సభ**

సీఎం పర్యటనలో ప్రధాన ఆకర్షణగా రగుడు బైపాస్ సమీపంలోని మైదానంలో బహిరంగ సభ జరగనుంది. సభా ప్రాంగణం, వేదిక, పార్కింగ్, బారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లను అధికారులు పరిశీలిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఏర్పాట్లను పకడ్బందీగా చేపడుతున్నారు. సిరిసిల్లకు ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అభివృద్ధి పనులు, నేతన్నల సంక్షేమం, విద్యా సదుపాయాలు, మహిళా సాధికారత అంశాలు ప్రధానంగా నిలవనున్నాయి.

## ఫార్ములా-ఈ కేసు: కేటీఆర్‌కు బిగ్ షాక్.. పాస్‌పోర్ట్ జప్తునకు కోర్టు ఆదేశం!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావుకు ఏసీబీ కోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కేటీఆర్‌తో పాటు మరో ముగ్గురి పాస్‌పోర్టులను తక్షణమే తాత్కాలికంగా జప్తు (ఇంపౌండ్) చేయాలంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కోర్టు హైదరాబాద్ రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయాన్ని (ఆర్‌పీవో) ఆదేశించింది. ఈ మేరకు న్యాయస్థానం ఆర్‌పీవోకు అధికారికంగా లేఖ రాసింది. కోర్టు ఆదేశాలతో ఈ కేసు మరోసారి రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా-ఈ రేసులో నిబంధనలకు విరుద్ధంగా రూ.55 కోట్ల ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏసీబీ విచారణకు ఆదేశించింది. దర్యాప్తు చేపట్టిన ఏసీబీ అధికారులు 2024 డిసెంబరులో అప్పటి పురపాలక శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు, ఫార్ములా-ఈ ఆపరేషన్స్ ప్రతినిధి అల్బెర్టో లోంగోలపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగా ఇప్పటికే నిందితులందరినీ విచారించి, వారి వాంగ్మూలాలను ఏసీబీ అధికారులు నమోదు చేశారు. అనంతరం కోర్టులో అభియోగపత్రం కూడా దాఖలు చేశారు. ప్రస్తుతం కేసు విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో, నిందితులు విదేశాలకు వెళ్లకుండా నిరోధించేందుకే వారి పాస్‌పోర్టులను జప్తు చేయాలని ఏసీబీ అధికారులు కోర్టును ఆశ్రయించారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, ఆర్‌పీవోకు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో ఐదో నిందితుడైన అల్బెర్టో లోంగో విదేశీయుడు కావడంతో, ఆయన పాస్‌పోర్టును జప్తు చేసే అధికారం ఇక్కడి అధికారులకు లేదు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో కేటీఆర్‌తో పాటు మిగతా ముగ్గురి పాస్‌పోర్టుల జప్తుపై ఆర్‌పీవో తదుపరి చర్యలు తీసుకోనుంది.

## 'తాయ్ మామన్' పథకానికి శ్రీకారం.. మేనమామలా మారిన సీఎం విజయ్

(మొదటి పేజీ తరువాయి)

పథకాన్ని ప్రారంభించారు. తల్లులను ఆప్యాయంగా కుర్చీల్లో కూర్చోబెట్టి, పక్కనే ఉండి చిన్నారుల వేళ్లకు జాగ్రత్తగా ఉంగరాలు తొడిగారు. అనంతరం ఆయన వేదిక దిగి కింద కూర్చున్న మరో 12 మంది తల్లులు, వారి శిశువుల వద్దకు వెళ్లారు. అక్కడ చిన్నారులను చేతుల్లోకి తీసుకుని, వారి తల్లిదండ్రులతో ఆప్యాయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు పేరు పెట్టాలని సీఎం విజయ్‌ను కోరారు. వారి అభ్యర్థనను మన్నించిన ఆయన, చిన్నారులను ఎత్తుకుని సంప్రదాయబద్ధంగా మూడుసార్లు పేరును ఉచ్ఛరించి నామకరణం చేశారు. ఈ భావోద్వేగపూరిత క్షణాల్లో అక్కడున్న వారంతా హర్షం వ్యక్తం చేశారు. అనంతరం తల్లులతో సెల్ఫీలు దిగి, కరచాలనం చేసి వారిని ఉత్సాహపరిచారు. ఆ తర్వాత ఆసుపత్రిలోని ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ వార్డును సందర్శించి, అక్కడ మరో 10 మంది శిశువులకు బంగారు ఉంగరాలు అందించారు. వైద్యుల సమక్షంలో చిన్నారులతో, వారి తల్లిదండ్రులతో సరదాగా గడిపారు.అంతకుముందు ఉదయం 11 గంటలకు చెన్నై నుంచి మధురై విమానాశ్రయానికి చేరుకున్న సీఎం విజయ్‌కు పార్టీ కార్యకర్తలు, అభిమానులు వందలాదిగా తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. ఆయన కాన్వాయ్ ఆసుపత్రికి వెళ్లే దారి పొడవునా ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలు నిలబడి పూలవర్షం కురిపించారు. రాజాజీ ఆసుపత్రి వద్ద వాహనం దిగి, జనసందోహం మధ్య నడుచుకుంటూనే వేదిక వద్దకు చేరుకున్నారు. దారిలో ఆసుపత్రి సిబ్బంది, ప్రజలకు అభివాదం చేస్తూ, పలుచోట్ల ఆగి వారితో ఫొటోలు దిగారు. సీఎం రాకతో ఆసుపత్రి పరిసరాలు జనసంద్రంగా మారాయి.



## ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ.. గెజిట్ విడుదల చేసిన అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

ఖాళీ అయినట్లు అధికారిక ప్రకటన వెలువడింది. సిట్టింగ్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటంతో ఈ స్థానాన్ని ఖాళీగా గుర్తిస్తూ తెలంగాణ శాసనసభ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. హైకోర్టు తీర్పును అనుసరించి, 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే ఆయన సభ్యత్వం రద్దయినట్లు ఈ నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ విజయం సాధించారు. అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరతూ బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అయితే, ఆ పిటిషన్లను స్పీకర్ తిరస్కరించడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్ సెప్టెంబర్ 18న కీలక తీర్పు వెలువరించింది. సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే కాంగ్రెస్ తరఫున లోక్‌సభకు పోటీ చేసిన సమయం నుంచే ఆయనపై అనర్హత వేటు అమల్లోకి వస్తుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ, అక్కడ కూడా ఆయన పిటిషన్ తిరస్కరణకు గురైంది. దీంతో ఆయన శాసనసభ్యత్వం రద్దు అధికారికంగా ఖరారైంది. ప్రస్తుతం ఆయన మాజీ ఎమ్మెల్యే అయ్యారు. మరోవైపు, త్వరలో జరగనున్న ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తానే మళ్లీ విజయం సాధిస్తానని దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## హైదరాబాద్‌లో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కలకలం..

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ నగరంలో మరోసారి చెడ్డీ గ్యాంగ్ కలకలం రేపింది. మణికొండలోని ఒక అపార్ట్‌మెంట్‌లోకి చొరబడిన ఈ ముఠా సభ్యులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.వివరాల్లోకి వెళితే, నిన్న తెల్లవారుజామున మణికొండలోని ఓ అపార్ట్‌మెంట్‌లోకి చెడ్డీ గ్యాంగ్ సభ్యులు ప్రవేశించారు. నివాసంలోకి చొరబడి దొంగతనానికి పాల్పడుతుండగా, ఒక మహిళ వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఆగ్రహించిన దుండగులు ఆమెపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఆరుగురు సభ్యులు అపార్ట్‌మెంట్‌లోని ఒక బ్లాక్‌లో సంచరిస్తున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఈ వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.ఈ ఘటనపై సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు, స్థానిక సెక్యూరిటీ గార్డులకు ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనతో చుట్టుపక్కల అపార్ట్‌మెంట్ల వాసులు భయాందోళన చెందుతున్నారు.

## యువకుడిపై చేయి చేసుకున్న మంత్రి... తీవ్రంగా స్పందించిన రాహుల్ గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. అధికార మదంతో బీజేపీ నేతలు ప్రవర్తిస్తున్నారని, వారికి ఓటర్లంటే కనీస భయం లేదని ఆయన ధ్వజమెత్తారు.వివరాల్లోకి వెళితే... ఢిల్లీ పీడబ్ల్యూడీ మంత్రి పర్వేశ్ వర్మ ఆదివారం తన నియోజకవర్గ పరిధిలోని తిలక్ నగర్‌లో రోడ్ల పనులను తనిఖీ చేశారు. ఆ సమయంలో ఓ యువకుడు రహదారుల నిర్మాణంలోని లోపాలపై ప్రశ్నిస్తూ వీడియో తీయడం ప్రారంభించాడు. దీంతో ఆగ్రహానికి గురైన మంత్రి ఆ యువకుడి చెంపపై కొట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.ఈ ఉదంతంపై రాహుల్ గాంధీ మండిపడ్డారు. "ప్రజలు బహిరంగంగా ప్రశ్నిస్తే చెంపదెబ్బ, పేపర్ లీకేజీలపై నిలదీస్తే లాఠీఛార్జ్, పార్లమెంటులో గళమెత్తితే మైక్ ఆఫ్ చేయడం.. ఇవన్నీ అధికార అహంకారానికి నిదర్శనం" అని ఆయన పేర్కొన్నారు. ఓట్లు దొంగిలించి అధికారంలోకి వస్తున్నందునే, తప్పు చేస్తే ప్రజలు గద్దె దించుతారన్న భయం వారిలో లేకుండా పోయిందని రాహుల్ ఆరోపించారు. ఇలాంటి పార్టీలకు ప్రజల మద్దతుతో పనిలేదని ఆయన వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ విమర్శలపై మంత్రి పర్వేశ్ వర్మ స్పందించారు. ఈ విషయం గురించి రాహుల్‌కు కనీస అవగాహన లేదని, ఆయన ఇటువంటి అంశాలకు దూరంగా ఉంటేనే మంచిదని హితవు పలికారు



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్



# శ్రీ శారద శతాబ్ది సన్మానోత్సవంలో నాగం వర్షిత్ రెడ్డి







**మహేశ్వరం సెప్టెంబర్ 28 నేటి వెలుగు ప్రతినిధి**

మహేశ్వరం దేవభూమిలో నిర్వహించిన శ్రీ శారద శతాబ్ది సన్మానోత్సవం--2026లి కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా, శ్రీమద్ జగద్గురు శంకరాచార్య అనంత శ్రీ స్వామి అమృతానంద దేవతీర్థజీ మహారాజ్, మాజీ రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి శ్రీ పంకజ్ మిథల్, బనారస్ హిందూ యూనివర్సిటీ మాజీ హెడ్ ప్రొఫెసర్ రామ్ నారాయణ్ ద్వివేది, అనంత కన్‌స్ట్రక్షన్స్ అధినేత శ్రీ అనంత నాయుడు తదితర ప్రముఖులు శాలువాతో ఘనంగా సన్మానించారు.శ్రీమద్ జగద్గురు శంకరాచార్య అనంత శ్రీ స్వామి అమృతానంద దేవతీర్థజీ మహారాజ్ వారి చాతుర్మాస వ్రతంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాశ్మీర్‌లోని శారదా సర్వజ్ఞ శారదా పీఠానికి ప్రస్తుత పీఠాధీశ్వరులుగా ఉన్న స్వామీజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆధ్యాత్మికవేత్తలు, ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా పాల్గొని శారదా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ శారద శతాబ్ది పురస్కారాలు--2026లిను ప్రదానం చేశారు. అలాగే ప్రొఫెసర్ వివేకానంద తివారీ రచించిన రెండు పుస్తకాలను ఆవిష్కరించారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు, ఆధ్యాత్మికవేత్తలు, భక్తులు శారదా మాతను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా శారద శతాబ్ది సన్మానోత్సవం ఘనంగా జరిగింది.

# ప్రజావాణి దరఖాస్తులు వారం రోజుల్లో పరిష్కరించాలి





**నల్గొండ జిల్లా సెప్టెంబర్ 28 నేటి వెలుగు ప్రతినిధి:**

ప్రజావాణిలో అందిన దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించాలని స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. అన్ని శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను కూడా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, వారి సమస్యను అర్థం చేసుకుని సకాలంలో పరిష్కారం చూపాలని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రజావాణికి సంబంధించిన దరఖాస్తులను ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉంచకుండా త్వరగా పరిష్కరించాలని అధికారులతో కోరారు. పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి వారం రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సోమవారం రెవిన్యూ శాఖకు 66 ,ఇతర శాఖలకు 82 మొత్తం 148 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా రెవిన్యూ అధికారి దశరథ మాట్లాడారు. శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ,జిల్లా గ్రామీణ అభివృద్ధి పిడి శేఖర్ రెడ్డి ,జిల్లా అధికారులు ప్రజల వద్దనుండి ఫిర్యాదులు స్వీకరించారు.

# ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలి





**జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 28 నేటి వెలుగు ప్రతినిధి**

సోమవారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను విన్నవిస్తూ మొత్తం 89 అర్జీలు సమర్పించారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ప్రజల నుంచి అర్జీలనుస్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అందుతున్న ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణిలో అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 54 అర్జీలు, ఇతర శాఖలకు సంబంధించి 35 అర్జీలు, మొత్తం 89 అర్జీలు అందాయి. ప్రతి అర్జీపై సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టి, పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుల వివక్షపై కలంతో పోరాడిన మహాకవి గుర్రం జాషువా

- **సామాజిక సమానత్వం కోసం జాషువా స్ఫూర్తితో ఉద్యమించాలి: బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**

**హైద్రాబాద్ సెప్టెంబర్ 28 నేటి వెలుగు ప్రతినిధి:**

తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యానికి కొత్త దిశ చూపిన మహాకవి గుర్రం జాషువా అని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు.ఆయన 131వ జయంతి సందర్భంగా నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ గుర్రం జాషువా గారు కుల వివక్ష,అంటరానితనం,సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించిన జాషువా ఆశయాలు నేటికీ సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు.గుర్రం జాషువా తన కవిత్వం ద్వారా అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని,మానవ సమానత్వాన్ని బలంగా చాటారని అన్నారు. 'గబ్బిలం', 'ఫిరదౌసి', 'క్రీస్తు చరిత్ర' వంటి రచనల ద్వారా తెలుగు సాహిత్యానికి విశిష్ట సేవలు అందించారని తెలిపారు.సమాజంలో మనిషిని మనిషిగా గౌరవించే పరిస్థితులు ఏర్పడాలని, కులం, మతం, ఆర్థిక స్థితి ఆధారంగా వివక్షకు తావు లేకుండా సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జాషువా సాహిత్యం కేవలం కవిత్వం మాత్రమే కాదని, అది సామాజిక మార్పు కోసం సాగిన ఒక చైతన్య ఉద్యమమని అన్నారు.నేటి యువత గుర్రం జాషువా సాహిత్యాన్ని అధ్యయనం చేసి ఆయన చూపిన మానవతా, సమానత్వ మార్గంలో నడవాలని జాజుల లింగంగౌడ్ పిలుపునిచ్చారు. అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని కోరారు



# రేబీస్ వ్యాధి పై అవగాహన అవసరం

**నల్గొండ, సెప్టెంబర్ 28, నేటి వెలుగు ప్రతినిధి:**



ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భం గా జంతు హింస నివారణ సంఘం నల్గొండ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిహించారు .ఈ కార్యక్రమం కు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీ ప్రేమ్ కరణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.రేబిస్ అనేది ప్రధానంగా సోకిన కుక్కలు మరియు ఇతర జంతువుల కాటు, గీతలు లేదా లాలాజలం ద్వారా మనుషులకు సంక్రమించే ప్రాణాంతక వైరల్ వ్యాధి. అయితే, సమయానికి తగిన వైద్య చికిత్స మరియు జంతువులకు క్రమం తప్పకుండా యాంటీ-రేబిస్ టీకాలు వేయడం ద్వారా రేబిస్‌ను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు.జంతువు కరిచిన వెంటనే గాయాన్ని సబ్బు మరియు ప్రవహించే నీటితో కనీసం 15 నిమిషాల పాటు శుభ్రంగా కడగాలి. అనంతరం ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి/ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్యుల సూచన మేరకు యాంటీ-రేబిస్ టీకాలు మరియు అవసరమైన చికిత్స తీసుకోవాలి. ప్రజలు తమ ఇళ్లలోని కుక్కలు, పిల్లులు మరియు ఇతర పెంపుడు జంతువులకు నిర్దిష్ట కాల వ్యవధిలో యాంటీ-రేబిస్ టీకాలు వేయించడంతో పాటు, వాటిని బాధ్యతాయుతంగా సంరక్షించాలని అధికారులు కోరారు. వీధి కుక్కల పట్ల కూడా జంతు సంక్షేమ నిబంధనలకు అనుగుణంగా బాధ్యతాయుతమైన నియంత్రణ, టీకాలు మరియు స్టెరిలైజేషన్ చర్యలు చేపట్టడం ద్వారా రేబిస్ నియంత్రణకు సహకరించాలని సూచించారు.పిల్లలు ముఖ్యంగా తెలియని కుక్కలు లేదా ఇతర జంతువులను ఆటపట్టించకుండా, వాటిని అనుమతి లేకుండా తాకకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు."రేబిస్‌ను నివారించవచ్చు -- ప్రతి జంతువుకు టీకా, ప్రతి కాటుకు తక్షణ చికిత్స" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చింది.ప్రజలు అపోహలను నమ్మకుండా, జంతువుల కాటు లేదా గీతలు సంభవించినప్పుడు వెంటనే వైద్య సలహా తీసుకోవాలని, రేబిస్ నివారణలో పశుసంవర్ధక శాఖ మరియు వైద్య ఆరోగ్య శాఖలకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్య మరియు పశు సంవర్ధక అధికారి డాక్టర్ జి వి రమేష్ ,ట్రైని కలెక్టర్ శ్రీ శ్రీకాంత్ రెడ్డి ఐఏఎస్,పీడీ డిఆర్డిఏ శేఖర్ రెడ్డి మరియు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# శివరాంపల్లి జెడ్పిహెచ్ ఎస్లో నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్

**విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన -- ప్రతిజ్ఞ, ర్యాలీ**






**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 28 నేటి వెలుగు ప్రతినిధి:**

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణకుమారి ఆదేశాల మేరకు శివరాంపల్లి జెడ్పిహెచ్ లో నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాలు, ఇతర వ్యసనాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఫ్లెక్సీలు, ఆడియో సందేశాల ద్వారా వ్యసనాలకు దూరంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులతో వ్యసనాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమం అనంతరం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. శీబా నాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ భూక్యా నాయక్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. నిఖిల్, ఆర్ బి ఎస్ కే సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు : జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. కె. ఆనంద్**

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సెప్టెంబర్ 28 నేటి వెలుగు ప్రతినిధి**



జిల్లాలో ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లిడా. కె. ఆనంద్‌లి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కార్యక్రమ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు, వివిధ ఆరోగ్య కార్యక్రమాల అధికారులు పాల్గొని జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా డా. కె. ఆనంద్ మాట్లాడుతూ లిబస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాల సేవలను మరింత మెరుగుపరచాలనిలి అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు, సిబ్బంది విధుల నిర్వహణను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విధుల సమయపాలనపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు నిర్ణీత సమయాల్లో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మాతా--శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

మాతా--శిశు ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయాలని డా. ఆనంద్ సూచించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సంబంధించిన ఆరోగ్య వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేసి, ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు.బాలికలకు లిహెచ్‌పీవీ టీకా కార్యక్రమంలిలో అర్హులైన విద్యార్థులకు విద్యాశాఖతో సమన్వయం చేసుకుని పూర్తిస్థాయిలో టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టీకా కవరేజీని పెంచడంతో పాటు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన ఇమ్యూనైజేషన్ టీకాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.

క్షయ, కుష్ఠు వ్యాధుల నియంత్రణకు చర్యలు

క్షయ వ్యాధి నియంత్రణ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని డా. ఆనంద్ సూచించారు. క్షయ అనుమానితులను గుర్తించడం, పరీక్షలు నిర్వహించడం, వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్స అందించడం, చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం వంటి అంశాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని కూడా మరింత పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. అనుమానిత కేసులను త్వరగా గుర్తించి పరీక్షలు నిర్వహించడం, నిర్ధారణ అయిన వారికి నిరంతర చికిత్స అందించడం, వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి కార్

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

# బోరు వేయాలంటే.. ఇంకుడు గుంత తప్పనిసరి

**ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత ఉంటేనే బోరుకు అనుమతి ఇవ్వాలి**






**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 28 నేటి వెలుగు ప్రతినిధి...**

నగర పరిధిలో విచ్చలవిడిగా బోర్లు వేయడం వల్ల భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటిపోతున్నాయని పర్యావరణ, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో తీవ్ర నీటి సంక్షోభం తలెత్తకుండా ఇప్పటి నుంచే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కుత్బుల్లాపూర్ తహసీల్దార్ భైరెడ్డి రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పర్యావరణ సామాజిక కార్యకర్త రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రతి ఇంటి యజమాని తన ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసిన తర్వాతే బోరు వేయడానికి అనుమతి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. బోరు యజమానులకు రెవెన్యూ, వాటర్ డిపార్ట్‌మెంట్ అధికారులు నోటీసులు జారీ చేసి, భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత బోరు యజమానులకు నోటీసులు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.కొత్త లేఅవుట్లు, హెచ్‌ఎండీఏ, డీపీ లేఅవుట్లలో కూడా వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇంకుడు గుంత ఉంటేనే రిజిస్ట్రేషన్, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీలకు అర్హత కల్పించేలా నిబంధనలు తీసుకురావాలని సూచించారు. ఇంట్లో లేదా ప్లాట్‌లో ఇంకుడు గుంత లేకపోతే బోరు వేయడానికి బోరు యజమానులు కూడా అనుమతించకుండా బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.వర్షపు నీటిని భూమిలోకి ఇంకించకుండా వృథా చేస్తే భవిష్యత్ తరాలకు తాగునీటి కొరత మరింత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. ఇప్పుడే నీటి పొదుపు, వర్షపు నీటి సంరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించకపోతే రానున్న రోజుల్లో వేల అడుగుల లోతుకు వెళ్లినా నీటి జాడ దొరకని పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చినా, అధిక ధరలు చెల్లించినప్పటికీ నీరు అందుబాటులో ఉండకపోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.నీరు ఉన్నప్పుడే దాని విలువ తెలియకపోతే.. నీరు లేని రోజుల్లో ఎంత డబ్బు పెట్టినా దొరకదని రక్తం దొరికే పరిస్థితి ఉండొచ్చు.. కానీ నీరు దొరకని దుస్థితి రాకుండా ఇప్పుడే మేల్కొనాలని వారు అన్నారు.భూగర్భ జలాల పరిరక్షణను అధికారులు అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని, అక్రమ బోర్లపై నిఘా పెంచడంతో పాటు ఇంకుడు గుంతల ఏర్పాటును తప్పనిసరి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో విఐపీ మల్లేష్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ వరంగల్ జిల్లా చైర్మన్‌గా భేతి అశోక్ బాబు

**వైస్ చైర్మన్‌గా శానబోయిన రాజకుమార్.. ట్రెజరర్‌గా బొల్లం శివ**

**స్టేట్ ఎంసీ మెంబర్‌గా నాడెం శాంతికుమార్ ఎన్నిక**

**వరంగల్ ప్రతినిధి , సెప్టెంబర్ 28 (నేటి వెలుగు ప్రతినిధి):**





ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వరంగల్ జిల్లా శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు సోమవారం ఏకగ్రీవంగా జరిగాయి. జిల్లా చైర్మన్‌గా భేతి అశోక్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా శానబోయిన రాజకుమార్, ట్రెజరర్‌గా బొల్లం శివ, స్టేట్ ఎంసీ మెంబర్‌గా నాడెం శాంతికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అలాగే రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులుగా కుసుమ సత్యనారాయణ (రిటైర్డ్ తహసీల్దార్), తోట సంపత్ (రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు), మండల పరుషరాములు (ఎన్‌జీఓ), మామిడాల రమేష్ బాబు (అడ్వకేట్), వద్ది రాజు ( టీఎన్జీవో ), చొప్పరి సోమయ్య ( ఎన్జీవో), ముల్క ప్రసాద్, పుల్లూరి వేణు (న్యాయవాది), డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి, మోతె తిరుపతి రెడ్డి, డాక్టర్ గజవెల్లి రాజకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన చైర్మన్ భేతి అశోక్ బాబు, ఇతర పదవుల ప్రతినిధులు, మేనేజింగ్ కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ ప్రతినిధులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారదను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.రెడ్ క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరువ చేసేందుకు నూతన కార్యవర్గం కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు.

# జిల్లా జైల్లో ఖైదీ ఆత్మహత్యయత్నం

**పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఖైదీ బాబురావు**

**గుట్టుగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నా జైలు అధికారులు..**

**ఆత్మహత్య కాదంటూ జైలు అధికారుల వివరణ..**

**నల్గొండ జిల్లా సెప్టెంబర్ 28 నేటి వెలుగు ప్రతినిధి..**

నల్గొండ జిల్లా కేంద్రంలోని జైల్లో ఖైదీ ఆత్మహత్యాయత్నం కలగనరేపింది. సోమవారం సాయంత్రం జిల్లా జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ బాబురావు పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. గుర్తించిన తోటి ఖైదీలు జైలు అధికారులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన బాబురావును ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో స్టమక్ వాచ్ చేసి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కాగా జిల్లా జైల్లోకి పురుగుల మందు ఎలా వచ్చిందో చెప్పలేకపోతున్నారు. కానీ జైల్లో కూరగాయల పెంపకం ఇతర పలు రకాల చెట్ల పెంపకాలకు సంబంధించి మందులు తీసుకువచ్చినట్లు ఖైదీలు చెబుతున్నారు. బాబురావు మోత్కూర్ లో జరిగిన ఒక హత్య కేసులో ఒక నిందితుడిగా శిక్ష అనుభవిస్తున్నట్లు తెలిసింది. కాగా చర్లపల్లి జైలులో కొన్ని రోజులు శిక్ష అనుభవిస్తూ మూడు సంవత్సరాల కితం నల్గొండ జైలుకు తరలించారు. కాగా మూడు సంవత్సరాలుగా ఇక్కడే ఉన్నాడు. విషయం బయటకు రాకుండా ఉండేందుకు జైలు అధికారులు రహస్యంగా ఖైదీ చికిత్స అందిస్తున్నారు ఈ విషయమై జై సూపర్డెంట్ సంప్రదించగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులోకి రాలేదు. జైలర్ బాలకృష్ణ మాట్లాడుతూ గత రెండు రోజులుగా అనారోగ్యంతో ఉండి కండ్లు తిరిగి కిందపడిపోవడంతో ఆసుపత్రి తీసుకొచ్చి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.



# కళామతల్లి సేవకు 'కాకతీయ కీర్తి'






- **కళా, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో ఈగ మల్లేశం సేవలకు**
- **"కాకతీయ కీర్తి పురస్కారం"**
- **ఓరుగల్లు కళా వైభవం చిరస్థాయిగా నిలవాలి**
- **కళల పరిరక్షణలో ఈగ మల్లేశం సేవలు అభినందనీయం**
- **ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
- **ఓరుగల్లు మట్టి వాసనను భావితరాలకు అందించాలి**
- **కాకతీయ కీర్తి పురస్కార గ్రహీత ఈగ మల్లేశం**

**హన్మకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 28 (నేటి వెలుగు ప్రతినిధి):**

కళా, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో ఈగ మల్లేశం సేవలను గుర్తించి "కాకతీయ కీర్తి పురస్కారం" అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.హన్మకొండలోని కాళోజీ కళాక్షేత్రం వేదికగా తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ, శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన 1123వ అంతర్జాతీయ కళా మహోత్సవం--'కాకతీయ కళా వైభవం' 41వ వార్షిక వసంతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షుడు, కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.కళారంగం, ప్రజాసేవతో పాటు కాకతీయుల చారిత్రక కళా వారసత్వ పరిరక్షణకు కృషి చేస్తున్న ఈగ మల్లేశంను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఘనంగా సత్కరించి ప్రతిష్టాత్మక 'కాకతీయ కీర్తి పురస్కారం', విశిష్ట ప్రశంసా పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కళలు సమాజానికి జీవనాడులని, వాటిని కాపాడుకోవడమే భావితరాలకు అందించే గొప్ప ఆస్తి అని అన్నారు. కళాకారుల సంక్షేమం, భారతీయ సంస్కృతి--సంప్రదాయాల పరిరక్షణకు ఈగ మల్లేశం చేస్తున్న నిరంతర సేవలు అభినందనీయమన్నారు. ఓరుగల్లు ఘనమైన కాకతీయ కళా వైభవం, జానపద సంపదను భావితరాలకు అందించడంలో శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి చేస్తున్న కృషిని ప్రశంసించారు. గౌరవం బాధ్యతను మరింత పెంచింది. పురస్కార గ్రహీత ఈగ మల్లేశం మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి 'కాకతీయ కీర్తి పురస్కారం' అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. ఈ పురస్కారం కేవలం వ్యక్తిగత అవార్డు కాదని, చారిత్రక ఓరుగల్లు గడ్డ శిల్పకళా వైభవానికి, మట్టి వాసనలతో ముడిపడిన జానపద సంపదకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానన్నారు.జానపద కళలను కాపాడుకోవాలిఒగ్గుకథ, చిందు యక్షగానం, పేరిణి నృత్యం, బతుకమ్మ, బోనాలు, జానపద గీతాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని ఈగ మల్లేశం అన్నారు. ఆధునిక కాలంలో అంతరించిపోతున్న జానపద కళారూపాలతో పాటు వాటినే నమ్ముకుని జీవిస్తున్న కళాకారులను ఆదరించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. కాకతీయుల శిల్పకళా వైభవాన్ని, జానపద కళలను నిర్లక్ష్యం చేయకుండా పరిరక్షించి రేపటి తరానికి భద్రంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు.నేటి యువతకు తెలంగాణ చరిత్ర, జానపద కళలు, సంస్కృతి గొప్పతనాన్ని తెలియజేసి, వాటిని ముందుకు తీసుకెళ్లేలా స్ఫూర్తినివ్వాలని పిలుపునిచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని కళాకారుల సంక్షేమానికి కళాకారుల సంక్షేమ మండలి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.



# హీరో భార్యకు నచ్చలేదని నన్ను తీసేశారు: తాప్సీ

**కెరీర్ తొలినాళ్లలో బాలీవుడ్‌లో ఎదురైన చేదు అనుభవాలు వెల్లడించిన తాప్సీ**

**ఓ స్టార్ హీరో కూడా తనను ప్రాజెక్ట్ నుంచి తప్పించాడని వ్యాఖ్య**

**టైప్‌కాస్ట్ కాకుండా ఉండేందుకు కొన్ని ఆఫర్లు వదులుకుంటున్నట్లు వెల్లడి**

ప్రముఖ నటి తాప్సీ తన కెరీర్ ఆరంభంలో బాలీవుడ్‌లో ఎదుర్కొన్న కొన్ని అవమానకరమైన అనుభవాలను పంచుకున్నారు. హీరో భార్యకు తాను నచ్చలేదనే వింత కారణంతో తనను ఓ సినిమా నుంచి తనను తొలగించారని వెల్లడించారు. ఇటీవల నయన్‌దీప్ రక్షిత్‌కు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తాప్సీ ఈ షాకింగ్ విషయాలను పంచుకున్నారు.తాప్సీ మాట్లాడుతూ, "ఓ సినిమాకు సంతకం చేసిన తర్వాత నన్ను తొలగించారు. కారణం ఏంటని అడిగితే, 'హీరో భార్యకు మీరు నచ్చలేదు' అని చెప్పారు. ఆ హీరో భార్యకు నేనెందుకు నచ్చలేదో ఇప్పటికీ నాకు తెలియదు" అని గుర్తుచేసుకున్నారు. అయితే ఆ నటుడు, ఆయన భార్య ఎవరనేది మాత్రం ఆమె వెల్లడించలేదు. మరో సందర్భంలో, ఓ ప్రముఖ హీరో తన స్థానంలో అతడికి బాగా సన్నిహితురాలైన నటిని తీసుకోవడం కోసం తనను సినిమా నుంచి తప్పించారని తాప్సీ పేర్కొన్నారు.అదే సమయంలో, పరిశ్రమలో నటీనటులను ఒకేరకమైన పాత్రలకు పరిమితం చేసే (టైప్‌కాస్ట్) ధోరణిపై కూడా తాప్సీ స్పందించారు. కొందరిని గ్లామర్ పాత్రలకు, మరికొందరిని సీరియస్ పాత్రలకు పరిమితం చేస్తారని, తన విషయంలో అలా జరగకుండా ఉండేందుకే కొన్ని ఆఫర్లను స్పష్టంగా తిరస్కరిస్తున్నానని ఆమె తెలిపారు. కాగా, తాప్సీ ఇటీవల 'అస్సి', 'గాంధారి' వంటి చిత్రాల్లో తన నటనతో ప్రశంసలు అందుకున్నారు.

Edited, Published and owned by PAMANAGUDNDLA NAVEEN KUMAR, Printed at SRI printers at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, PAMANAGUDNDLA NAVEEN KUMAR : RNI No. TELTEL 2023/88559, Cell : 9553276552,